తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

సంపుటి: 02
సంచిక:66

24 క్యారెట్లు 142,800.00 | కిలో వెండి 2,00,000.00 | chourastha Digitals | 05.11.2026 గురువారం, హైదరాబాద్



మోదీని ఐదు నిమిషాల్లోనే 'దేశద్రోహి' అని నిరూపిస్తా

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- ప్రధానిపై తీవ్ర ఆరోపణలు.. ట్రంప్ నియంత్రణలో మోదీ ఉన్నారంటూ వ్యాఖ్యలు
- ఏడాదిలోపే కేంద్ర ప్రభుత్వం కూలిపోతుంది
- అదానీ పోర్టులో పట్టుబడిన డ్రగ్స్ ఏమయ్యాయి
- పంజాబ్‌లో డ్రగ్స్ సమస్యను నిర్మూలించడంలో ఆప్ ప్రభుత్వం విఫలం

కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని సంచలన ఆరోపణలు చేశారు. మోదీ తనతో ముఖాముఖి చర్చకు వస్తే, ఐదు నిమిషాల్లోనే ఆయన దేశద్రోహి అని, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో పనిచేస్తున్నారని నిరూపిస్తానని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ఏడాదిలోపే కేంద్ర ప్రభుత్వం కూలిపోతుందని జోస్యం చెప్పారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో నిర్వహించిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :

ప్రధాని మోదీతో ముఖాముఖి చర్చకు సిద్ధంగా ఉన్నానని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ చర్చకు మధ్యవర్తిగా ఎవరినైనా నియమించుకోవచ్చని గతంలోనే సవాల్ విసిరినట్లు గుర్తు చేశారు. అయితే పార్లమెంటులో చర్చిద్దామని ఎన్డీయే నేతలు చెబుతున్నారని, లోక్‌సభలో తాను మాట్లాడేందుకు ప్రయత్నించినప్పుడు మైక్ కట్ చేస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై బహిరంగ చర్చ జరగాలని డిమాండ్ చేశారు. దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మూడేళ్ల గడువు విధించడంపై రాహుల్ విమర్శలు చేశారు. గుజరాత్‌లోని అదానీ పోర్టులో గతంలో

।మిగతా 2 లో।



సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవం

యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సదర్ వేడుకలు

సీఎం రేవంత్ రెడ్డి

సదర్ సమ్మేళనానికి హాజరైన ముఖ్యమంత్రి.. రూ.5 కోట్ల నిధుల కేటాయింపు

ఎన్టీఆర్ స్టేడియంలో కనువిందు చేసిన దున్నరాజుల ప్రదర్శనలు

యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

మంత్రులు, ప్రజాప్రతినిధులు

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి...తేజస్వి యాదవ్

సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతను చాటిచెప్పే సదర్ వేడుకలు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో శ్రీకృష్ణ సదర్ సమితి నిర్వహించిన సదర్ సమ్మేళనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యాదవులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన దున్నరాజుల ప్రదర్శనలు, కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సదర్ శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

సదర్ సమ్మేళనం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సదర్ వేడుకలను అధికారిక పండుగగా నిర్వహిస్తోందని, ఇందుకోసం రూ.5 కోట్ల నిధులు కేటాయించామని

।మిగతా 2 లో।



బేతుపల్లి చెరువులో పెను విషాదం

- మత్స్యకారులను కాపాడేందుకు వెళ్లి 10 మంది ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గల్లంతు
- సహాయక చర్యలు ముమ్మరం..
- ఘటనాస్థలానికి వెళ్లనున్న మంత్రి పొంగులేటి
- సిబ్బంది గల్లంతుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా

2లో



సీఈసీ, ఈసీలకు జీవితకాల చట్టపరమైన రక్షణ!

- సెక్షన్ 16 రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టులో విచారణ
- కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు..
- నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశం

5లో

తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుంది

- బెంగాల్‌లో కార్యకర్తల కల నెరవేరింది
- తెలంగాణలోనూ సాకారం చేస్తాం
- తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్
- నాగోల్‌లో ఘనంగా జాతీయవాదుల సంగమం–2026
- గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరేస్తాం
- కాసం వెంకటేశ్వర్లు
- దేశంలో జాతీయ భావన మరింత పెరగాలి
- రాంచందర్ రావు



2లో

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్ పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ కార్యకర్తల సుదీర్ఘకాల స్వప్నం నెరవేరిందని, అదే విధంగా తెలంగాణలోనూ కార్యకర్తల కలను సాకారం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశమంతా వికసిత భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా



కండక్టర్ ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం అండ

- తల్లికి ప్రభుత్వ ఉద్యోగం,ఇందిరమ్మ ఇల్లు
- రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా..రూ.కోటి ప్రమాద బీమా
- నిందితురాలిపై హత్య కేసు నమోదు.. కఠిన చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

2లో

కామారెడ్డి మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

- 14 మంది సీనియర్ విద్యార్థులపై సస్పెన్షన్ వేటు..
- నలుగురికి ఆరు నెలలు,
- మరో పది మందికి నాలుగు నెలల శిక్ష
- ఎట్టి పరిస్థితుల్లోనూ ర్యాగింగ్ సహించేది లేదు
- కళాశాల ప్రిన్సిపాల్



2లో

ప్రియుడి సాయంతో భర్తను హత్య చేసిన భార్య

- కామారెడ్డిలో దారుణం
- వివాహేతర సంబంధమే హత్యకు కారణం
- మద్యం తాగించి నైలాన్ తాడుతో గొంతు బిగించి హతమార్చిన నిందితులు
- చెరువులో మృతదేహం పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం
- భార్యతో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు



5లో

తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుంది

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్ పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ కార్యకర్తల సుదీర్ఘకాల స్వప్నం నెరవేరిందని, అదే విధంగా తెలంగాణలోనూ కార్యకర్తల కలను సాకారం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశమంతా వికసిత భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నాగోల్‌లో నిర్వహించిన 'జాతీయవాదుల సంగమం-2026' కార్యక్రమానికి సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కర్ణాటక రాష్ట్ర బీజేపీ సహ ఇన్‌ఛార్జిగా కాసం వెంకటేశ్వర్లు నియమితులైన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావుతో పాటు పలువురు పార్టీ నాయకులు, విశ్వవిద్యాలయాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు



ఈ సందర్భంగా సునీల్ బన్సల్ మాట్లాడుతూ.. తాము ఏబీవీపీ కార్యకర్తలుగా ఉన్న సమయంలో కన్న ఎన్నో కలలు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సాకారమయ్యాయని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ కార్యకర్తల దీర్ఘకాలిక లక్ష్యం నెరవేరిందని, తెలంగాణలోనూ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలికే దిశగా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ కర్ణాటక సహ ఇన్‌ఛార్జి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. రాబోయే రోజుల్లో గోల్కొండ కోటపై బీజేపీ కాషాయ జెండా ఎగురవేస్తామని వ్యాఖ్యానించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజల్లో జాతీయ భావన పెరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ఈ భావన మరింత విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో దేశ వ్యతిరేక భావజాలాన్ని ప్రోత్సహించే శక్తులను వ్యతిరేకించాలని వ్యాఖ్యానించారు. వ్యక్తులకు ప్రాధాన్యత ఇవ్వకుండా పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాల బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాగా, జాతీయవాదుల సంగమం-2026లో పలువురు బీజేపీ నాయకులు, విద్యావేత్తలు, ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీని ఐదు నిమిషాల్లోనే 'దేశద్రోహి' అని నిరూపిస్తా



తరువాయి భాగం

పట్టుబడిన వేల కిలోల మాదకద్రవ్యాలు, హెరాయిన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటని ప్రశ్నించారు. జైళ్లలో ఉన్న గ్యాంగ్‌స్టర్లకు ఆశ్రయం కల్పిస్తున్నారంటూ అమిత్ షాపై ఆరోపణలు చేశారు. శాంతిభద్రతల గురించి మాట్లాడే ముందు మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితులపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపైనా రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని భగవంత్ మాన్ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. పంజాబ్‌లో ఏ ఒక్క ప్రాంతం నుంచైనా మాదక ద్రవ్యాల సమస్యను తొలగించగలిగారా అని ప్రశ్నించారు. ఈ సమస్య తీవ్రతను తాను గతంలోనే ప్రస్తావించినప్పుడు ప్రతిపక్షాలు తన వ్యాఖ్యలను తప్పుబట్టాయని గుర్తుచేశారు. పంజాబ్‌లో శాంతిభద్రతల పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని రాహుల్ గాంధీ అన్నారు. ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు డ్రగ్స్ సమస్యను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు.

పంజాబ్ ప్రజలకు తమ కోసం పనిచేసే ప్రభుత్వం కావాలని, ఢిల్లీ నుంచి నడిచే ప్రభుత్వం కాదని ఆమ్ ఆద్మీ పార్టీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. యువతకు ఉపాధి, డ్రగ్స్ రహిత పంజాబ్ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని రాహుల్ గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. కాగా, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.



సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవం

తరువాయి భాగం

వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాదవులకు అన్ని విధాలా గౌరవం కల్పిస్తోందని తెలిపారు.

హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు శాంతియుతంగా, సుఖసంతోషాలతో జీవిస్తున్నారని పేర్కొన్నారు. యాదవులు నిర్వహించే సదర్ సంబురాలు ఎంతో ప్రత్యేకమైనవని కొనియాడారు. మంత్రివర్గ సమావేశాన్ని సైతం వాయిదా వేసుకుని ఈ వేడుకలకు హాజరైనట్లు సీఎం తెలిపారు. మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, భారత్ ఫ్యూచర్ సిటీ, మెట్రో రైలు విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగాలని సీఎం ఆకాంక్షించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఈ ప్రాజెక్టులు కీలకమని, వాటి అమలుకు ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సదర్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయ రంగానికి పశుసంపద ఎంతో కీలకమని, పశుసంపద అభివృద్ధి చెందితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. సదర్ ద్వారా యాదవుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారు ఆర్థిక వ్యవస్థలోనూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి: తేజస్వి యాదవ్

యాదవ సమాజ ఐక్యత దేశవ్యాప్తంగా విస్తరించాలని బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ ఆకాంక్షించారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోరాడతామని స్పష్టం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో సదర్ వేడుకలు నిర్వహించడం ప్రత్యేకమని ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ అన్నారు. బలహీన వర్గాల ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి: పొన్నం ప్రభాకర్

సదర్ పండుగ హైదరాబాద్ నగర ఖ్యాతికి ప్రతీకగా నిలుస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. యాదవులు సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందాలని, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సదర్ వేడుకలు సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తున్నాయని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఎలాంటి సవాళ్లు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

యాదవుల ఐక్యతకు సదర్ ప్రతీక: వాకిటి శ్రీహరి

అంతరించిపోతున్న ఆచారాలు, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడమే సదర్ సమ్మేళనం ప్రధాన ఉద్దేశమని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. సదర్ సమ్మేళనం యాదవుల ఐక్యతకు చిహ్నమని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మహాభారతం నుంచి దేశ చరిత్ర వరకు యాదవుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఒక ప్పుడు హైదరాబాద్‌కే పరిమితమైన ఈ వేడుకలు ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు విస్తరించడం సంతోషకరమని పేర్కొన్నారు. యాదవులంతా సంఘటితంగా ఉండి భవిష్యత్తులో తమ సామాజిక, రాజకీయ ప్రాధాన్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, యాదవ సంఘాల నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సామాజిక వర్గాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కామారెడ్డి మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

తెలంగాణ చౌరస్తా. స్టేట్ బ్యూరో :

కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. జూనియర్ విద్యార్థులను మానసికంగా, శారీరకంగా వేధించినట్లు వచ్చిన ఆరోపణలపై కళాశాల యాజమాన్యం 14 మంది సీనియర్ విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంది. వీరిలో నలుగురిని ఆరు నెలల పాటు, మరో పది మందిని నాలుగు నెలల పాటు తరగతులకు హాజరుకాకుండా సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. వారం రోజుల క్రితం కొందరు సీనియర్ విద్యార్థులు తమను తీవ్రంగా వేధిస్తున్నారంటూ జూనియర్లు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) యాంటీ ర్యాగింగ్ సెల్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదుపై స్పందించిన ఎన్ఎంసీ అధికారులు స్థానిక పోలీసులతో పాటు కళాశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించి విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో కళాశాల యాజమాన్యం అంతర్గత విచారణ చేపట్టింది. విచారణలో ర్యాగింగ్‌కు సంబంధించిన ప్రాథమిక ఆధారాలతో పాటు వీడియో ఆధారాలు కూడా లభించినట్లు సమాచారం. దీంతో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో హెచ్ఓడీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఆరోపణలు ఎదుర్కొంటున్న 14 మంది సీనియర్ విద్యార్థులపై సస్పెన్షన్ వేటు వేశారు.

సస్పెండ్ అయిన విద్యార్థుల్లో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నట్లు తెలిసింది. ఒకే ర్యాగింగ్ ఘటనలో 14 మంది వైద్య విద్యార్థులపై చర్యలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామంతో బాధిత జూనియర్ల తల్లిదండ్రులతో పాటు సస్పెన్షన్‌కు గురైన సీనియర్ల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు.

ఎన్ఎంసీ నిబంధనల ప్రకారమే కఠిన చర్యలు తీసుకున్నామని కళాశాల ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. కళాశాలలోనైనా, హాస్టల్‌లోనైనా ర్యాగింగ్‌కు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత, క్రమశిక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.



బేతుపల్లి చెరువులో పెను విషాదం

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. వరదలో చిక్కుకున్న ఐదుగురు మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన 10 మంది ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గల్లంతయ్యారు. భారీ వర్షాలకు చెరువు అలుగు పారుతుండటంతో సహాయక చర్యల కోసం వెళ్లిన సిబ్బంది ప్రమాదంలో చిక్కుకోవడం కలకలం రేపింది.

రెండు బోట్లు బోల్తా.. 10 మంది గల్లంతు

బేతుపల్లి చెరువులో చేపల వేటకు సంబంధించి నెట్లు ఏర్పాటు చేసేందుకు వెళ్లిన ఐదుగురు మత్స్యకారులు ఒక్కసారిగా పెరిగిన వరద ప్రవాహంలో చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు తొలుత ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది బోటులో వెళ్లగా, వారు కూడా వరదలో చిక్కుకుపోయారు. దీంతో కొత్తగూడెం ఎస్‌డీఆర్ఎఫ్‌కు చెందిన ఆరుగురు, మరో నలుగురు అగ్నిమాపక సిబ్బంది రెండు బోట్లలో సహాయక చర్యలకు బయలుదేరారు.

తొలుత ప్రమాదంలో చిక్కుకున్న ముగ్గురు అగ్నిమాపక సిబ్బందిని సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చారు. అనంతరం మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన రెండు బోట్లు బలమైన గాలులు, వరద ఉద్ధృతికి బోల్తా పడటంతో అందులో ఉన్న 10 మంది సిబ్బంది గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం మరో బోటులో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భద్రాచలం నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించారు. బోట్ల సాయంతో వరదలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

బేతుపల్లి చెరువులో ఎస్‌డీఆర్ఎఫ్ బోట్లు గల్లంతైన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ప్రమాదంలో చిక్కుకున్న సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు. అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

మరోవైపు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘటనపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు అధికారులు ఘటనా స్థలంలోనే ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వపరంగా అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. గల్లంతైన వారి ఆచూకీ గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని అధికారులకు తెలిపారు. అలాగే వరదలో చిక్కుకున్న మత్స్యకారుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఘటనా స్థలానికి మంత్రి పొంగులేటి

బేతుపల్లి చెరువు ప్రమాదంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గల్లంతైన సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిస్థితిని స్వయంగా పరిశీలించేందుకు గురువారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లనున్నట్లు మంత్రి వెల్లడించారు. బేతుపల్లి చెరువులో చోటుచేసుకున్న ఈ ఘటనతో స్థానికంగా ఆందోళన నెలకొంది. గల్లంతైన సిబ్బంది, మత్స్యకారుల ఆచూకీ కోసం సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం అండ

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

ప్రయాణికురాలి దాడిలో మృతిచెందిన మణుగూరు డిపో మహిళా కండక్టర్ ప్రవళిక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు కేటాయించడంతో పాటు ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున ఉమ్మడిగా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అంతేకాకుండా ఆర్టీసీ ప్రమాద బీమా పథకం ద్వారా బ్యాంకుల నుంచి రూ.కోటి బీమా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.బుధవారం ప్రవళిక మృతదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి నివాళులర్పించారు. అనంతరం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న ఆమె తల్లిని పరామర్శించి ఓదార్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఆర్థికంగా ఎన్ని సహాయాలు అందించినా కోల్పోయిన కుటుంబ సభ్యురాలిని తిరిగి తీసుకురాలేమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కుటుంబ సభ్యురాలైన ప్రవళికను కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆర్టీసీ యాజమాన్యం ఆసుపత్రికి చేరుకుని మెరుగైన వైద్యం అందించేందుకు ప్రయత్నించిందని, అయినప్పటికీ ఆమె ప్రాణాలను కాపాడలేకపోయామని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో తొలుత నిందితురాలిపై హత్యాయత్నం కేసు నమోదు చేయగా, ప్రవళిక మృతిచెందడంతో హత్య కేసుగా మార్చినట్లు తెలిపారు. నిందితురాలిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. ఆర్టీసీ సిబ్బంది ఎవరైనా పొరపాటుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, అంతేకానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడకూడదన్నారు. ఒక మహిళా కండక్టర్‌పై దాడి కారణంగా ఒక కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి అనేక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. సిబ్బందిలో అసంతృప్తి లేకుండా పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.ఆర్టీసీ అత్యంత క్రమశిక్షణతో పనిచేసే సంస్థ అని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం తమ బాధ్యత అని పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రయాణికులను దేవుళ్లుగా భావించి సేవ చేయడం సిబ్బంది విధి అని, అదే సమయంలో కార్మికుల భద్రత, సంక్షేమం కూడా ప్రభుత్వానికి ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రయాణికులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైనా, సిబ్బందిపై ఫిర్యాదులు ఉన్నా చట్టపరిధిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు.పోయిన సామగ్రిని సైతం బాధ్యతగా తిరిగి అప్పగించే నిబద్ధత కలిగిన సంస్థ ఆర్టీసీ అని కొనియాడారు. ప్రయాణికుల సౌకర్యాలతో పాటు కార్మికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రవళిక కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి మరోసారి భరోసా ఇచ్చారు.





యాదవుల ఆత్మగౌరవానికి ప్రతీక సదర్ ఉత్సవాలు

- ఎన్టీఆర్ గార్డెన్స్‌లో ఘనంగా సదర్ సమ్మేళనం..
- పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:



యాదవుల ఆత్మగౌరవం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు అద్దం పడుతున్నాయని పలువురు నాయకులు పేర్కొన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన సదర్ సమ్మేళనం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు,యాదవ కురుమ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్, గోధ నరేందర్ యాదవ్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.సదర్ ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యాదవులు ఎంతో ప్రేమతో, శ్రమతో పెంచిన దున్నపోతుల ప్రదర్శనను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవుల సంప్రదాయాలు, తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచే సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న అంజన్ కుమార్ యాదవ్, అనిల్ కుమార్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. యాదవులు ఎంతో శ్రమించి పెంచిన దున్నపోతుల ప్రదర్శన గర్వకారణమని, ఇలాంటి ఉత్సవాలు భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేస్తూ స్ఫూర్తినిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా యాదవ బంధువులందరికీ దీపావళి, సదర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, యాదవ సంఘాల ప్రతినిధులు,యాదవ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కాలేజీని పరిశీలన

- హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి
- విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాడతాం మాజీ మంత్రులు
- శాశ్వత భవనాన్ని వెంటనే నిర్మించాలని డిమాండ్

అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని మంగళ్‌పల్లిలో ఉన్న భారత్ కాలేజీ ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతున్న మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కాలేజీని మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డిలతో పాటు రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా కాలేజీలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులతో వారు ప్రత్యేకంగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.తాత్కాలిక భవనంలో సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని అన్ని మౌలిక వసతులతో కూడిన శాశ్వత మెడికల్ కాలేజీ భవనాన్ని త్వరితగతిన నిర్మించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విద్యార్థులు మాజీ మంత్రులకు విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల సమస్యలపై స్పందించిన మాజీ మంత్రులు మాట్లాడుతూ... మెడికోల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని,విద్యార్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పదేళ్ల నిరీక్షణకు తెర

- పేదింట్లో ఇందిరమ్మ వెలుగులు,
- భీంపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

కమలాపూర్ తెలంగాణ చౌరస్తా:

హన్మకొండ జిల్లా, కమలాపూర్, మండల, కేంద్రంలోని,భీంపల్లి గ్రామంలో, రాచమల్ల స్రవంతి-రవి దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి, గ్రామ సర్పంచ్, వాసలా శ్రీనివాస్,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పైస శరత్ హాజరయ్యారు. పదేళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతో నెరవేరిందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు, గ్రామ సర్పంచ్ వాసాల శ్రీనివాస్‌కు రాచమల్ల స్రవంతి-రవి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందని, కొనియాడారు.ఈ కార్యక్రమంలో,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

వరి దిగుబడి అంచనా పరిశీలన

- సాధారణ దిగుబడి వచ్చిందని తెలిపిన ఎంఎస్ఓ వడ్డేపల్లి సంతోష్
- స్థానిక సర్పంచ్ పొన్నగంటి కుమార్

కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:

కమాన్‌పూర్ మండలంలోని నాగారం గ్రామంలో బుధవారం వరి ధాన్యం దిగుబడి అంచనా ప్రయోగాలు నిర్వహించారు. మండల స్టాటిస్టికల్ అధికారి వడ్డేపల్లి సంతోష్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రైతు పొలంలో పంట కోత ప్రయోగం చేపట్టారు. నాగారం గ్రామానికి చెందిన రైతు గడ్డి స్వప్న యొక్క పావు గుంట పొలంలో పంట కోత ప్రయోగం చేయగా 12.050 కేజీల ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. మండలంలో వరి సాధారణ దిగుబడి నమోదు కానున్నట్లు ఎంఎస్ఓ వడ్డేపల్లి సంతోష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొనగంటి కుమార్ వార్డు సభ్యులు గడ్డి సతీష్. ఇటవేన శైలజ, పొనగంటి. రవి పాల్గొన్నారు





సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సీపీ డా. ఎం. రమేష్
- సైబర్ భద్రతపై అవగాహన పోస్టర్లు ఆవిష్కరణ
- 200 మంది విద్యార్థులకు అవగాహన

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

సైబర్ నేరాల నివారణతో పాటు డిజిటల్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు నవంబర్ నెలను సైబర్ క్రైమ్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో సుమారు 200 మంది విద్యార్థుల సమక్షంలో సైబర్ భద్రతకు సంబంధించిన అవగాహన పోస్టర్లను సీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, గుర్తుతెలియని ఏపీకే ఫైళ్లను ఓపెన్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నకిలీ పెట్టుబడి ఆఫర్లు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్లు చేసే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. సామాజిక మాధ్యమాల ఖాతాలకు రెండు అంచెల భద్రత (టూఫ్యాక్టర్ అథెంటికేషన్) ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సైబర్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులు సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా ఆర్థిక నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్, సైబర్ క్రైమ్స్ డీసీపీ పుష్ప తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



భూ వినియోగ మార్పుల జీవోలు తక్షణమే విడుదల చేయాలి

- హెచ్ఎండిఏ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్‌తో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి భేటీ

ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న భూ వినియోగ మార్పులకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం హెచ్ఎండీఏ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.గతంలో ఓపెన్ స్పేస్, కన్జర్వేషన్, ఇండస్ట్రియల్, మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లుగా ఉన్న భూములను నివాస ప్రాంతాలుగా మార్చాలని బండ్లగూడ,నాగోల్, కొత్తపేట,కర్మన్‌ఘాట్, హయత్‌నగర్, ఫతుల్లాగూడ తదితర ప్రాంతాలకు చెందిన 10 ముసాయిదా ప్రతిపాదనలను సమర్పించినట్లు తెలిపారు.గతంలోనే జీవో ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుతో నిలిపివేసిందని విమర్శించారు.అలాగే బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్‌లో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వినతిపై స్పందించిన ఎండీ త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అరవింద్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పోగుల రాంబాబు, కొత్త భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవరకొండ పోతులూరాచారి



రామన్నపేట, తెలంగాణ చౌరస్తా:

యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్టిస్ట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా దేవరకొండ పోతులూరాచారి ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఐదో వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నిర్వహించిన నూతన కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవరకొండ పోతులూరాచారి, ఉపాధ్యక్షుడిగా కందుల అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా తరణి వీరాచారి, అధికార ప్రతినిధిగా కొల్లోజు సోమ నరసింహాచారి, కోశాధికారిగా జెల్లా జహంగీర్, ప్రచార కార్యదర్శిగా గుర్రం సంతోష్ కుమార్, సహాయ కార్యదర్శిగా బొడిగె లింగం గౌడ్ ఎన్నికయ్యారు. అదేవిధంగా సలహాదారులుగా రావులపల్లి బాలాచారి, పుర్మ శ్రీశైలం, ఆడెపు రఘురాములు, గుంటోజు శ్రీనివాసాచారి, తిప్పారపు మల్లేష్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దేవరకొండ పోతులూరాచారి మాట్లాడుతూ.. నూతన కార్యవర్గం కళాకారుల అభ్యున్నతికి, ఐక్యతకు, జిల్లా కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. కళాకారుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు సంఘం తరఫున కృషి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.



అశ్వారావుపేటలో మురసు తుఫాన్ బీభత్సం

- జలమయమైన పట్టణం
- చెరువుకు గండి కొట్టి ముప్పును తప్పించిన మున్సిపల్ సిబ్బంది
- వర్షా న్ని లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిషనర్ దిలీప్ రెడ్డి

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:

మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట పట్టణంలో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షానికి పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీగా వరద నీరు పోటెత్తడంతో పలు ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
ముఖ్యంగా దొంతికుంట చెరువు ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో పాటు, అలుగు పొంగి రహదారిపై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో సమీపంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డి వెంటనే అప్రమత్తమయ్యారు.ఎడతెరిపి లేని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ద్విచక్ర వాహనంపై పట్టణంలోని వివిధ వార్డుల్లో పర్యటిస్తూ పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. అనంతరం ఐబీ డీఈతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.కమిషనర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన మున్సిపల్ సిబ్బంది దొంతికుంట చెరువుకు గండి కొట్టి వరద నీటి ప్రవాహాన్ని మళ్లించారు. దీంతో చెరువు పరిసర ప్రాంతాల్లో పొంచి ఉన్న ప్రమాదాన్ని అదుపులోకి తీసుకురాగలిగారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ముప్పు తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.భారీ వర్షంలోనూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సహాయక చర్యలను పర్యవేక్షించిన కమిషనర్ దిలీప్ రెడ్డి చొరవను, సమయస్ఫూర్తితో పనిచేసిన మున్సిపల్ సిబ్బంది సేవలను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.అధికారులు,సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాణి ఆనంది ఎంపిక

కమాన్‌పూర్, తెలంగాణ చౌరస్తా:

కమాన్‌పూర్ మండలానికి చెందిన యువ అథ్లెట్ నల్లవెల్లి ఆనంది జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై మండలానికి గర్వకారణంగా నిలిచింది. ఖమ్మం వేదికగా నిర్వహించిన ఎస్‌జీఎఫ్ 70వ రాష్ట్ర స్థాయి అండర్17 అథ్లెటిక్స్ పోటీల్లో పరుగు పందెంలో అద్భుత ప్రతిభ కనబరిచిన ఆనంది బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది.రాష్ట్ర స్థాయి పోటీల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఈ నెల 19న మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆమె ఎంపికైంది. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్నిదక్కించుకోవడంతో కమాన్‌పూర్ మండలంలో ఆనందిపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.
ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు బోనాల వెంకట స్వామి, కోశాధికారి డాక్టర్ పి. విజయకుమార్, సభ్యులు లయన్ జబ్బార్ ఖాన్, బండ సాయి శంకర్, పిల్లి శేఖర్, మాజీ సర్పంచ్ పిడుగు నరసయ్య తదితరులు ఆనందిని ఘనంగా అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.జాతీయ స్థాయిలోనూ పతకం సాధించి కమాన్‌పూర్ కీర్తిని దేశవ్యాప్తంగా చాటాలని వారు ఆకాంక్షించారు.



అప్పన్నపేట జడ్పీహెచ్ఎస్‌కు 50 బెంచీల విరాళం

- ఎంకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహకారం
- గతంలోనూ పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు
- బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :

విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించాలనే లక్ష్యంతో మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎంకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీజేపీ ఎమ్మెల్సీ, మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మల్క కొమురయ్య 50 బెంచీలను విరాళంగా అందజేశారు. కాగా, పాఠశాలలో విద్యార్థులకు సరిపడా కూర్చునే సదుపాయాలు లేవని తెలుసుకున్న ఎమ్మెల్సీ మల్క కొమురయ్య వెంటనే స్పందించి 50 బెంచీలను అందించడం పట్ల పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గతంలోనూ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఇదే పాఠశాలకు స్కూల్ ఆర్చ్, గేటును అందించి పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేను చదువుకున్న బడి రుణం తీర్చుకోవడం నా బాధ్యత..

ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ.. తాను పదో తరగతి వరకు ఇదే ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించానని గుర్తుచేసుకున్నారు. బంధంపల్లి నుంచి ప్రతిరోజూ ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ అప్పన్నపేటకు వచ్చి చదువుకున్నానని తెలిపారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల రుణం తీర్చుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థిగా, దీని అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్న ఎంకే ఫౌండేషన్‌కు, ఎమ్మెల్సీ మల్క కొమరయ్యకు గ్రామస్తులు, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం కొనసాగిస్తామని ఫౌండేషన్ సభ్యులు వెల్లడించారు.





టీ.ఎన్.జీ.ఓస్ క్రీడా పోటీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి

- ఎల్.బి. స్టేడియంలోని ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంలు కేటాయించాలని క్రీడల మంత్రికి వినతి

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

హైదరాబాద్‌లో త్వరలో నిర్వహించనున్న టీ.ఎన్.జీ.ఓస్ కేంద్ర సంఘం క్రీడా పోటీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి టీ.ఎన్.జీ.ఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి దా. ఎస్.ఎం. హుస్సేని ముజీబ్ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రానున్న క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించేందుకు హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలోని ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంలను కేటాయించడంతో పాటు క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లు కల్పించాలని మంత్రిని కోరారు. అనంతరం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) జితేందర్ రెడ్డిని కూడా టీ.ఎన్.జీ.ఓస్ కేంద్ర సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించిన అంశాలను వివరించారు. పోటీల విజయవంతమైన నిర్వహణకు ప్రభుత్వ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీ.ఎన్.జీ.ఓస్ కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఐటీఐ ఫోరం అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతుల కోసం పోరాడే ఎమ్మెల్యేపై విమర్శలా

- ముందు మీ చేతగానితనానికి సమాధానం చెప్పండి
- కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సూటి ప్రశ్న..రైతుల సమస్యలపై మీ పోరాటాలెక్కడ?
- పదవుల కోసం ఆరాటమా.. రైతుల ప్రయోజనాలపై నిర్లక్ష్యమా?

తెలంగాణ చౌరస్తా,కమలాపూర్:



రైతుల పక్షాన నిరంతరం పోరాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకుల రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని కమలాపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతు కొనుగోలు కేంద్రాల ప్రారంభం విషయంలో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న హడావుడిపై మండిపడ్డారు. మార్కెట్ చైర్మన్ పదవీకాలం ముగుస్తుందనే తొందరతో ఎమ్మెల్యే లేకుండానే కొనుగోలు కేంద్రం ప్రారంభించేందుకు ఆరాటపడుతున్నారని ఆరోపించారు. రైతుల ప్రయోజనాల కంటే పదవులే ముఖ్యమయ్యాయా, అని ప్రశ్నించారు.రైతుబంధు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నా, రైతుబీమా అందక కుటుంబాలు ఆందోళన చెందుతున్నా కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం, సాగునీరు, విద్యుత్ సమస్యలపై మీ పోరాటాలెక్కడని నిలదీశారు. కమలాపూర్ చెరువు, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఏనాడైనా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారా అని సూటిగా ప్రశ్నించారు. సొంత పార్టీలో గ్రూపు రాజకీయాలు, పదవుల కోసం పోటీలు తప్ప ప్రజా సమస్యలపై పోరాడే చిత్తశుద్ధి కాంగ్రెస్ నాయకులకు లేదని విమర్శించారు. రైతుల కోసం నిరంతరం గొంతెత్తుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని విమర్శించడం మానుకొని ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని హితవు పలికారు. రైతులపై నిజంగా ప్రేమ ఉంటే విమర్శలు కాదు.. రైతులకు చేసిన పనులపై సమాధానం చెప్పాలని,బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేనరెడ్డి, సత్యనారాయణరావు, మాజీ జడ్పీటీసీ నవీన్, లక్ష్మణ్‌రావు, కేడీసీసీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, ఫోరం అధ్యక్షుడు రాజేష్, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అశోక్, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రవణ్, పుల్ల శ్రీను, శ్రీకాంత్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగు భూమి సంరక్షణతోనే సుస్థిర వ్యవసాయం

- రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించాలి
- కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి. నరేష్ కుమార్

నూతనకల్, తెలంగాణ చౌరస్తా:

సాగు భూమి సారాన్ని కాపాడుకుంటూ, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారానే సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని కేవీకే గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి. నరేష్‌కుమార్ అన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలు సాగు చేయాలని సూచించారు.నూతనకల్ మండలంలోని మిర్యాల రైతు వేదికలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో - సాగు భూమి సంరక్షణ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ నరేష్ కుమార్ రైతులకు భూసార పరిరక్షణ, నీటి యాజమాన్యం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే రకమైన పంటలను నిరంతరం సాగు చేయడం వల్ల నేలలో పోషక పదార్థాల సమతుల్యత దెబ్బతింటుందని తెలిపారు. ఈ సమస్యను నివారించేందుకు పంట మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, భూమి స్వభావం, అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని పేర్కొన్నారు.రసాయన ఎరువులను సమతుల్యంగా వినియోగించడం, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం వంటి చర్యలు వ్యవసాయానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయని వివరించారు. సాగు భూమిని సంరక్షించడం ప్రస్తుత రైతుల బాధ్యత మాత్రమే కాదని, భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించడం కూడా మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నూతనకల్ మండల వ్యవసాయ అధికారి ధీరావత్ సైదా నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి పావని, మిర్యాల ఉపసర్పంచ్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



బసంత్‌నగర్‌లో రోడ్డుపైనే కిలోమీటర్ మేర లారీల పార్కింగ్





- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- ప్రమాదాలపై వాహనదారుల ఆందోళన
- పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలని అల్ట్రాటెక్ యాజమాన్యానికి విజ్ఞప్తి

పాలకుర్తి, తెలంగాణ చౌరస్తా :

బసంత్‌నగర్‌లోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి లోడుతో బయటకు వస్తున్న సిమెంట్ లారీలను ప్రధాన రహదారిపైనే కిలోమీటర్ మేర నిలిపివేస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బసంత్‌నగర్ నుంచి ఈశాలతక్కలపల్లి, పాలకుర్తి గ్రామాల వైపు వెళ్లే ప్రధాన రహదారిపై లారీలు వరుసగా పార్కింగ్ చేయడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది.ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారిపై నిలిపి ఉంచిన లారీలు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, రోడ్డుపై లారీల పార్కింగ్ కారణంగా ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు.రోడ్డుపైనే లారీలను నిలిపివేయడం వల్ల ఇతర వాహనాలకు సరైన దారి లేకపోవడంతో పాటు ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి లారీల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. రహదారిపై లారీలను నిలిపివేయకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని,ప్రయాణికుల భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 9 మందికి జైలు శిక్ష



- 21 కేసుల పరిష్కారం..
- రూ.30,100 జరిమానా విధించిన మేడ్చల్ కోర్టు

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై న్యాయస్థానం చర్యలు తీసుకుంది. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన 21 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను బుధవారం మేడ్చల్‌లోని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు విచారించి పరిష్కరించింది. ఈ కేసుల్లో పలుమార్లు మద్యం సేవించి వాహనాలు నడిపిన 9 మందికి జైలు శిక్ష విధించడంతో పాటు మొత్తం రూ.30,100 జరిమానా విధించింది.కోర్టు తీర్పు ప్రకారం ఒకరికి 3 రోజుల జైలు శిక్ష, ఐదుగురికి 5 రోజుల చొప్పున, మరొకరికి 7 రోజులు, ఇద్దరికి 10 రోజుల చొప్పున జైలు శిక్ష విధించింది.ఈ సందర్భంగా మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు పలు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల వాహనదారుల ప్రాణాలతో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం పొంచి ఉంటుందని హెచ్చరించారు. ఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.





తుపానును లెక్కచేయకుండా మానవత్వం చాటిన యువత

- అశ్వారావుపేటలో నడుములోతు నీటిలో రెండు మృతదేహాలకు అంత్యక్రియలు
- కుటుంబ సభ్యులు లేని అనాథ శవాలకు అండగా నిలిచిన సేవా సమితి సభ్యులు
- డీజిల్, టైర్ల సహాయంతో వర్షంలోనే దహన సంస్కారాలు పూర్తి

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:

ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనా మానవత్వమే తమకు ముఖ్యమని చాటుకున్నారు అశ్వారావుపేటకు చెందిన కొందరు యువకులు. తుపాను ప్రభావంతో భారీ వర్షం కురుస్తున్నా, స్మశానవాటికలోకి నడుములోతు నీరు చేరినా వెనకడుగు వేయకుండా కుటుంబ సభ్యులు లేని రెండు మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని 'అమ్మ సేవా సదన్' వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న ఓ వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే ఆయనకు కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతోపాటు, దూరపు బంధువులు సైతం అంత్యక్రియలకు హాజరయ్యేందుకు నిరాకరించారు. ఈ విషయం తెలుసుకున్న అరుణాచలేశ్వర సేవా సమితి, పవన్ కళ్యాణ్ సేవా సమితి సభ్యులు స్పందించి అంత్యక్రియల బాధ్యతను స్వీకరించారు.ఇదే సమయంలో మురసు తుపాను ప్రభావంతో ఉదయం 9 గంటల నుంచి భారీ వర్షం కురుస్తుండగా, స్మశానవాటికలోకి నడుములోతు నీరు చేరింది. వర్షానికి కట్టెలు పూర్తిగా తడిసిపోవడంతో దహన సంస్కారాలు నిర్వహించడం కష్టంగా మారింది. అయినప్పటికీ యువకులు వెనుకడుగు వేయకుండా 20 లీటర్ల డీజిల్, 15 టైర్లను ఉపయోగించి దహన సంస్కారాలు ప్రారంభించారు. వర్షంలో తడుస్తూనే మృతదేహం పూర్తిగా దహనమయ్యే వరకు అక్కడే ఉండి తమ బాధ్యతను నిర్వర్తించారు.
ఈ క్రమంలో మరో మృతదేహం కూడా స్మశానవాటికకు చేరుకోవడంతో యువకులకు మరో సవాలు ఎదురైంది. అయినప్పటికీ అదే పట్టుదలతో రెండో మృతదేహానికి కూడా అంత్యక్రియలు నిర్వహించారు. అన్ని ప్రతికూల పరిస్థితులను అధిగమించి మధ్యాహ్నం 2 గంటలకల్లా రెండు మృతదేహాల దహన సంస్కారాలను పూర్తి చేశారు.
కుటుంబ సభ్యులు, ఆప్తులు లేని వారికి తామున్నామంటూ ముందుకొచ్చిన సేవా సమితి సభ్యుల చొరవ స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది. తుపాను బీభత్సాన్ని సైతం లెక్కచేయకుండా అనాథ మృతదేహాలకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించడం ద్వారా యువత మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.

మరణించిన ఆర్టీసీ కండక్టర్ కి నివాళి

- ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు
- ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:

ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ కార్యవర్గ సమావేశం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్ ఏఐటియుసి కార్యాలయంలో జరిగింది.ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ గౌరవాధ్యక్షులు కంది అశోక్ రెడ్డి,చైర్మన్ టేకుమల సమ్మయ్య,రీజినల్ కార్యదర్శి కొమురయ్య మాట్లాడుతూ...బస్సులో నుండి తోయడంతో విధి నిర్వహణలో మరణించిన ఆర్టీసీ కార్మికురాలు ప్రవళిక కుటుంబానికి ఎంప్లాయిస్ యూనియన్ తీవ్ర సంతాపాన్ని సానుభూతి వ్యక్తం చేస్తుందని వారు తెలిపారు.ఆర్టీసీ కార్మికురాలు ప్రవళిక కు రావలసిన బెనిఫిట్స్ వెంటనే ఆర్టీసీ యాజమాన్యం చెల్లించాలని వారు కోరారు.రీజినల్ లో అన్ని రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని దీనికి అధికారులందరూ సహకరించాలని అలాగే రీజినల్ లో డ్రైవర్లకు, కండక్టర్లకు ఇతర సిబ్బందికి సెలవుల మంజూరులో కానీ సిక్ లీవ్ లలోతో పాటు మరే ఇతర సమస్యలైన యూనియన్ కు సహకరించాలని వారు కోరారు. కరీంనగర్ రీజినల్ నూతన కమిటీని 31 మందితో ఎన్నుకోవడం జరిగింది.15 మందిని ఆఫీస్ బేరర్స్ గా 16 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా కంది అశోక్ రెడ్డి,చైర్మన్ గా టేకుమల సమ్మయ్య,అధ్యక్షులుగా గణపతి,వర్కింగ్ ప్రెసిడెంట్ .ఎం శివకృష్ణ,ఉపాధ్యక్షులుగా ఏవై.రెడ్డి,వి.దేవయ్య,టీవీ ప్రసాద్,ఐలయ్య, ప్రధాన కార్యదర్శిగా కే కొమురయ్య యాదవ్,కార్యదర్శులుగా పి రజిత,సిహెచ్ శ్రీనివాస్,జె.రవి,వి.మహేందర్,జ్యోతి,ఏ.శ్రీనివాస్,కోశాధికారిగా కే బుచ్చయ్య లతో పాటు 16 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.కరీంనగర్ టు డిపో నుండి ఐఎన్టీయూసీ కి చెందిన జె.శ్రీనివాస్,సిహెచ్. శ్రీనివాసులు ఎంప్లాయిస్ యూనియన్ లో చేరడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐటిసి జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కనక రెడ్డి బుచ్చన్న యాదవ్,టేకుమల్ల సమ్మయ్య,కరీంనగర్ టిజిఎస్ ఆర్టిసి రీజియన్ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి ఎం.గణపతి,కొమ్ము కొమురయ్య యాదవ్,రీజినల్ కార్యదర్శి పి రజిత, రీజియన్ నాయకులు శివకృష్ణ శ్రీనివాస్,సునీత, బుచ్చన్న,బానయ్య,పీకే స్వామి,కరీంనగర్ రీజన్లోని అన్ని డిపోల నాయకులు పాల్గొన్నారు.



టీఆర్ఎస్ జిల్లా జాయింట్ సెక్రటరీగా లెనిన్

లక్షెట్టిపేట, తెలంగాణ చౌరస్తా:



తెలంగాణ రాష్ట్ర సమితి మంచిర్యాల జిల్లా జాయింట్ సెక్రటరీగా లక్షెట్టిపేట పట్టణానికి చెందిన బాణాల లెనిన్‌నిషా నూతనంగా నియమితులయ్యారు.పార్టీ పట్ల నిబద్ధతతో,ప్రజా సేవలో చురుకుగా పనిచేస్తున్న ఆయన కృషిని గుర్తించి పార్టీ అధ్యక్షురాలు కవిత బాధ్యతను అప్పగించింది.ఈ సందర్భంగా నూతన జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ...జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి,ప్రజా సమస్యల పరిష్కారం కోసం,పేదలు,రైతులు,యువత,విద్యార్థుల సంక్షేమం కోసం నిజాయితీగా కృషి చేస్తానని తెలిపారు.ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి,జిల్లా నాయకులకు,కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



మృతుల కుటుంబాలకు పరామర్శ

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి ,పందిల్ల గ్రామాలకు చెందిన వారు ఇటీవల పరమపదించగా మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ వారి నివాసాలకు వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపన్ని వ్యక్తం చేశారు. ఆయన మాజీ సర్పంచ్ అటికం శంకర్,మాజీ ఎంపీటీసీ రావి సదానందం,గ్రామస్తులు పాల్గొన్నారు.





కాసులపల్లి నుంచే బీజేపీ విజయ ప్రస్థానం ప్రారంభం

- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు పరస్పర ఆరోపణలు మాని.. లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం కావాలి
- 200 మందికి పైగా నల్ల మనోహర్ రెడ్డి సారథ్యంలో బీజేపీ పార్టీలో చేరిక
- తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్లా మనోహర్ రెడ్డి

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో శరవేగంగా దూసుకు పోతోందని, దేశ రక్షణ, సమైక్యత, శాంతిభద్రత లకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తున్న పార్టీ బీజేపీ ఒక్కటేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి అన్నారు. పెద్దపల్లి నియోజక వర్గంలోని కాసులపల్లి గ్రామంలో కాంగ్రెస్, బీఆ ర్ఎస్ పార్టీలకు చెందిన సుమారు 200 మంది యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, దేశ రక్షణకు తీసుకుంటున్న నిర్ణయాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారని తెలిపారు. 'నేషన్ ఫస్ట్' నినాదంతో దేశ ప్రయోజనాలే పరమా వధిగా బీజేపీ పనిచేస్తోందని పేర్కొన్నారు. కాసుల పల్లి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పార్టీలో చేరడం బీజేపీపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసాని కి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలతో అధికారంలోకి వచ్చినప్పటికీ, నేటికీ ప్రజలకు సాగునీరు, తాగునీరు వంటి కనీస అవస రాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించా రు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సొంత గ్రామమైన కాసులపల్లి నుంచే బీజేపీలోకి భారీగా చేరికలు ప్రారంభం కావడం రాజకీయంగా ప్రా ధాన్యత సంతరించుకుందని అన్నారు. గ్రామాల్లో ఇళ్లు, పెన్షన్లు, వైద్యం వంటి కనీస సౌకర్యాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే లు ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకోవ డం మాని, నిజాయితీ నిరూపించుకునేందుకు లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం కావాలని నల్ల మనోహర్ రెడ్డి సవాల్ విసిరారు. ప్రజలకు ఉపయోగపడే రోడ్ల నిర్మాణాన్ని పక్కనపెట్టి, కేవలం కమీషన్లు వచ్చే పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిం చారు. కొందరు నాయకులు ప్రజా సేవ కంటే తమ వ్యాపారాలు, ఆస్తుల పరిరక్షణకే రాజకీయాలను ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో బీజేపీ ఆధ్వర్యంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తామని, పేదలకు ఇళ్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు అందేలా ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో రాబోయే రోజుల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పేదల సంక్షేమం, గ్రామాల అభివృ ద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ బీజేపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని గద్దల రాజు, అమరబండ సతీష్, కొలిపాక శేఖర్, అమరగొండ ప్రదీప్, బిరుదు మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వర్షంలో చిక్కుకున్న ప్రయాణికులకు బీఆర్ఎస్ నాయకుల అండ

- బాధితులకు ఆహార పొట్లాలు, బిస్కెట్లు, తాగునీటి పంపిణీ
- కాసాని పద్మ, డా. ఉదయజ్యోతి సేవా కార్యక్రమం
- మున్సిపల్, పోలీస్ సిబ్బంది సేవలకు ప్రశంసలు

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:

అశ్వారావుపేట పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, దూర ప్రాంత ప్రయాణికులకు బీఆర్ఎస్ నాయకులు అండగా నిలిచారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో ప్రయాణాలు సాగించలేక ఇబ్బందులు పడుతున్న వారికి కాసాని పద్మ, 14వ వార్డు కౌన్సిలర్ డా. ఉదయజ్యోతి సహాయక చర్యలు చేపట్టారు.భారీ వర్షాల కారణంగా గమ్య స్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు ఆహార పొట్లాలు, బిస్కెట్లు, తాగునీటి బాటిళ్లను పంపిణీ చేశారు. విపత్కర పరిస్థితుల్లో ప్రయాణికులు ఆకలితో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. అవసరమైన వారికి తమ వంతు సహాయం అందించడం బాధ్యతగా భా విస్తున్నామని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీస్ శాఖ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది సేవలను వారు ప్రత్యేకంగా అభినందిం చారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థా యిలో సహాయక చర్యలు చేపడుతూ ప్రజలకు భరోసా కల్పిస్తున్న సిబ్బంది కృషి అభినందనీయ మని కొనియాడారు.అలాగే భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్య వసరమైతే తప్ప బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. ప్రమాదకర ప్రాంతాలు, నీరు నిలిచిన రహదారుల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విప త్కర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.





యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య పెంచాలి

- GO నం.31 నిబంధనలను సవరించాలి
- స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించాలి
- రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఖాళీలను ఒకేసారి భర్తీ చేయాలి
- ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్, కార్యదర్శికి నిరుద్యోగ జేఏసీ వినతిపత్రం

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసి స్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్యను పెంచడంతో పాటు, అన్ని యూనివర్సిటీల్లో ఖాళీలను ఒకేసారి భర్తీ చేయాలని నిరుద్యోగ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియలో అభ్య ర్థులకు న్యాయం జరిగేలా GO నం.31లోని ని బంధనలను సవరించాలని, స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌లకు నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో అసి స్టెంట్ ప్రొఫెసర్ నియామకాలు చేపట్టి దాదాపు 13 సంవత్సరాలు గడిచినా, ఇప్పటికీ పూర్తిస్థా యిలో ఖాళీల భర్తీ జరగకపోవడం ఆందోళనక రమన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన నియామక నోటిఫికేషన్‌ను కేవలం ఏడు యూనివర్సిటీలకే పరిమితం చేయడం సరికాదని అభిప్రాయపడ్డా రు. అంతేకాకుండా విభాగాల వారీగా ఖాళీల వివరాల్లో స్పష్టత లేదని, అవసరమైన అనేక విభాగాలకు తక్కువ పోస్టులు కేటాయించగా, మరికొన్ని విభాగాలకు అసలు పోస్టులే కేటాయిం చలేదని పేర్కొన్నారు. GO నం.31లోని పార్ట్‌బి, వెయిటేజీ విధానానికి సంబంధించిన నిబంధన లను పునఃపరిశీలించాలని జేఏసీ నాయకులు కోరారు. యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణం గా అవసరమైన సవరణలు చేపట్టి, నియామకా ల్లో అభ్యర్థులందరికీ సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులన్నిం టినీ ఒకేసారి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీల భర్తీతో ఉన్నత విద్యారంగం బలోపేతం కావడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకా శాలు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వం, ఉన్నత విద్యా మండలి ఈ సమస్యపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.ఎల్.మూర్తి, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నేత డా.శంకర్, ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి అజయ్, పీడీఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం శ్యామ్, ని రుద్యోగ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ రామటెంకి శీను తదితరులు పాల్గొన్నారు.

వీసా విధానంలో సమూల మార్పులు

న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:

భారతదేశ వీసా ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సిద్ధమైం ది. వీసా నిబంధనల్లో విప్లవాత్మక మార్పులు తీ సుకురానుంది. ఇందులో భాగంగా ప్రధాన వీసా కేటగిరీలను 13 నుంచి 9 కి తగ్గించడంతో పాటు వీసా దరఖాస్తు ఫారమ్‌లలోని అంశాలను 70 శాతం మేర తగ్గించాలని నిర్ణయించినట్లు అధికా రులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "వీసా ప్రక్రియను మరింత సరళంగా, సులభంగా మార్చేందుకు వీలుగా 'వీసా మాన్యువల్, 2019' పై గత ఆగస్టులో హోం మంత్రిత్వ శాఖ సమగ్ర సమీక్ష చేపట్టింది. ఆ సమావేశంలో భారతీయ వీసా విధానాన్ని హేతుబద్ధీకరించి, సరళతరం చేయాలని నిర్ణయించారు. దాని ప్రకారం, ప్ర స్తుతం ఉన్న 13 ప్రధాన వీసా కేటగిరీలను 9కి, అలాగే 49 సబ్‌కేటగిరీలను 23కి తగ్గించాలని నిర్ణయించారు. దీనివల్ల దరఖాస్తుదారులకు ఏ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకోవాలో సులభంగా అర్థమవుతుంది" అని సంబంధిత వర్గాలు పేర్కొ న్నాయి.అంతేకాకుండా, వీసా దరఖాస్తు ఫార మ్‌లలోని 70 శాతం అంశాలను తొలగించడం ద్వారా, వాటిని మరింత క్లుప్తంగా మార్చాలని కేంద్రం నిర్ణయించింది. ఒకే రకమైన, పదేపదే అడిగే, అనవసరమైన ప్రశ్నలను పూర్తిగా తొల గించడం ద్వారా వినియోగదారులకు సులభంగా అర్థమయ్యేలా వీసా ఫారమ్‌లను రూపొందించ డం ఈ చర్య ముఖ్య ఉద్దేశం. ఈ మార్పులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూ పొందిస్తున్నారు. అన్ని రకాల వీసా కేటగిరీలకు, సబ్‌కేటగిరీలకు ఈ కొత్త నిబంధనలు అమలు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఇమిగ్రేషన్ నిబంధనల్లో కీలక మార్పులు

ఇదిలా ఉండగా, జూన్ నెలలో ఇమిగ్రేషన్ నిబంధ నలకు సంబంధించి హోంశాఖ కీలక మార్పులు చేసింది. విదేశీయులు అనుమతి పొందిన సమయం కన్నా ఎక్కువ రోజులు భారత్‌లో ఉండాలంటే వారి వీసా గడువు ముగియకముం దే విదేశాంగశాఖ వద్ద రిజిస్టర్ చేసుకోవాలని సూచించింది. అందుకు సంబంధించి కేంద్రం నో టిఫికేషన్ జారీ చేసింది. భారత్‌కు 180 రోజులు అంతకంటే తక్కువ గడువు వీసాలపై వచ్చే విదే శీయులకు ఈ నిబంధన వర్తిస్తుందని పేర్కొంది. ఒకవేళ వీరు భారత్‌లో కొనసాగాలంటే వీసా గడువు ముగియకముందే రిజిస్ట్రేషన్‌ను పూర్తి చే



సుకోవాలని చెప్పింది. వాస్తవానికి గతంలో వీసా గడువు పూర్తైన తర్వాత 14 రోజుల్లోపు పొడిగింపు నకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉండేది, కానీ ఆ నిబంధనల ప్రకారం ముందే రిజిస్ట్రేషన్ చేసుకో వాలి. భారత్‌లో ఉన్న విదేశీ పౌరులపై పర్యవేక్షణ కు ఆ నిబంధన ఉపయోగపడనుందని హెంశాఖ అభిప్రాయపడింది. అలాగే, భారత్‌లో సంతానం ఉన్న విదేశీయుల కోసం మరో మార్పు చేసింది. భారత్‌లో బిడ్డ జన్మించిన 30 రోజుల్లోపు ఆన్‌లైన్ లేదా మొబైల్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. నిబంధన ప్రకారం తల్లిదండ్రుల్లో ఒకరు భారత జాతీయులై ఉండి, తమ పౌరసత్వా న్ని ఉంచుకోవాలనుకుంటే మాత్రం అలాంటివారి కి బిడ్డ పుట్టుక రిజిస్ట్రేషన్ నుంచి మినహాయింపు ను ఇచ్చింది.కాగా, భారతీయుల విదేశీ ప్రయాణ వ్యయాలు (విహార యాత్రలతో కలిసి) సుమారు రూ.10,400 కోట్లకు పరిమితమయ్యాయని ఆర్‌బీఐ మే నెలలో వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్ర వరిలో విదేశీ ప్రయాణాల వ్యయాలు 1.3 బి.డాల ర్లు కాగా, మార్చిలో 212.43 మిలియన్ డాలర్లు అంటే, సుమారు రూ.2,000 కోట్లు తగ్గినట్లయ్యిం ది. జనవరిలో ఈ వ్యయాలు 1.65 బి.డాలర్లుగా నమోదయ్యాయి. 'నివాస వ్యక్తుల కోసం సరళీకృత చెల్లింపుల పథకం (ఎల్ఆర్ఎస్) కింద విదేశాలకు పంపే చెల్లింపుల' వివరాలనూ ఆర్‌బీఐ పేర్కొంది. ప్రయాణాలు, దగ్గరి బంధువుల పోషణ, విదేశాల్లో చదువులు, ఈక్విటీ, డెట్‌లో పెట్టుబడుల కోసం విదేశాల్లో మనవారు ఖర్చు చేసినట్లు సమాచారం. ఎల్ఆర్ఎస్ కింద, మైనర్లతో పాటు నివాసితులైన వ్యక్తులు, ఏదైనా అనుమతించిన కరెంట్ లేదా క్యాపిటల్ ఖాతా లావాదేవీ కోసం లేదా రెండింటికి కలిపి ప్రతి ఆర్థిక సంవత్సరంలో 2,50,000 డాలర్ల (సుమారు రూ.2.37 కోట్ల) వరకు పంపిం చుకోవచ్చు. 2026 మార్చిలో మొత్తం విదేశాలకు పంపిన డబ్బు విలువ 2.59 బి.డాలర్లుగా ఉంది. ఇందులో ప్రయాణానికి సంబంధించిన వాటా 1.09 బి.డాలర్లతో అతి పెద్దదిగా ఉంది.

సీఈసీ, ఈసీలకు జీవితకాల చట్టపరమైన రక్షణ!

న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన చర్యల నుంచి జీవి తకాల రక్షణ కల్పించే నిబంధనపై సుప్రీంకోర్టు విచారణకు అంగీకరించింది. 2023లో రూపొం దించిన ఎన్నికల కమిషనర్ల నియామకం, పదవీ కాలం, సేవా నిబంధనల చట్టంలోని సెక్షన్ 16రా జ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసి నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదే శించింది. ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, సామాజిక కార్యకర్త అరుణ్ అగ్రవాల్ ఈ పిటిషన్లు దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనాలతో కూడిన ధర్మాసనం పిటిషన్లను పరి శీలించింది. ఇదే అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న మరో పిటిషన్‌తో కలిపి వీటిని విచారిస్తామ ని స్పష్టం చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది.

2023లో రూపొందించిన చీఫ్ ఎలక్షన్ కమిషన ర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అపాయిం ట్‌మెంట్, కండిషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీస్) చట్టంలోని సెక్షన్ 16ను పిటిషనర్లు సవాల్ చేస్తున్నారు. ఈ నిబంధన ప్రకారం సీఈసీ, ఎన్నికల కమిషనర్లు తమ అధికారిక విధుల నిర్వ హణలో చేసిన చర్యలు, వ్యక్తం చేసిన అభిప్రాయా లకు సంబంధించి వారిపై సివిల్ లేదా క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న కేసులనూ కొనసాగించడానికి వీలుండదని నిబంధన పేర్కొంటోంది. ఈ రక్షణ విస్తృతమైన మినహాయింపును సాధారణ చట్టం ద్వారా కల్పించారని అభ్యంతరం తెలిపారు. రాష్ట్రపతి, గవర్నర్లకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 361, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆర్టికల్స్ 105, 194 కింద నిర్దిష్ట రక్షణలు ఉన్నాయని గుర్తుచేశా రు. అయితే ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన ఆర్టికల్ 324లో ఇలాంటి సంపూర్ణ చట్టపరమైన మినహాయింపు లేదని పేర్కొన్నారు.సీఈసీని పదవి నుంచి తొలగించేందుకు సుప్రీంకోర్టు న్యాయమూ ర్తిని తొలగించే తరహా ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని, ఈ నిబంధన సంస్థ స్వతంత్రతను కాపాడటానికే తప్ప చట్టపరమైన చర్యల నుంచి సంపూర్ణ రక్షణ కల్పించడానికి కాదని పిటిషనర్ వాదించారు.ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు సైతం నిర్దిష్ట పరిస్థితుల్లో విచారణను ఎదుర్కొం టారని, ఎన్నికల కమిషనర్లకు మాత్రం సంపూర్ణ మినహాయింపు ఇవ్వడం సమంజసం కాదని పేర్కొన్నారు.


స్వతంత్రత అంటే జవాబుదారీతనం లేకపోవడం కాదు

మరో పిటిషనర్ అరుణ్ అగ్రవాల్ కూడా సెక్షన్ 16లోని 'Is or Was' అనే పదాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పదాలు ప్రస్తు తం పదవిలో ఉన్నవారితో పాటు గతంలో ఆ పదవిలో పనిచేసిన వారికి కూడా రక్షణ కల్పి స్తున్నాయని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేయడం ప్రజాస్వామ్యానికి అత్యంత ముఖ్యమని, అయితే స్వతంత్రత పేరుతో జవాబుదారీతనం నుంచి తప్పించు కునే అవకాశం ఉండకూడదని వాదించారు. ఓటర్ల జాబితాలో పేర్లను తప్పుగా తొలగించ డం, దురుద్దేశపూర్వకంగా ఎన్నికల ప్రక్రియలో వ్యవహరించడం లేదా అవినీతి ఆరోపణలు వచ్చిన సందర్భాల్లోనూ చట్టపరమైన చర్యలకు అవకాశం లేకుండా పోతుందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో సెక్షన్ 16ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి రద్దు చేయాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును కోరారు. ఇరుపక్షాల వాదనలను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం స్పందన కోరుతూ నోటీసులు జారీ చేసిన ధర్మాసనం తదుపరి వి చారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది.ఈ కేసులో సుప్రీంకోర్టు వెలువరించే తీర్పు ఎన్నికల సంఘం స్వతంత్రత, అధికారుల చట్టపరమైన జవాబుదారీతనం మధ్య ఉన్న సంబంధంపై కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది.

ప్రియుడి సాయంతో భర్తను హత్య చేసిన భార్య

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

వివాహేతర సంబంధం ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసేందుకు భార్య పథకం రచించిన ఘటన కామారెడ్డి జిల్లాలో వెలుగుచూసింది. వివాహేతర సంబంధాలకు అడ్డుగా ఉన్నాడనే కారణంతో కాశీరామ్ అనే వ్యక్తిని హత్య చేసి, మృతదేహాన్ని చెరువులో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు నిందితులు ప్రయత్నించారు. పోలీసుల దర్యాప్తులో ఈ దారుణ ఘటన వెనుక ఉన్న అసలు విషయాలు బయటపడ్డాయి. బాన్సువాడ మండలం హన్మాజీ పేటకు చెందిన కాశీరామ్ ఇటీవల చెరువులో అను మానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి భూమయ్య గత నెల 23న పోలీసు లకు ఫిర్యాదు చేశారు. మృతదేహం మెడపై గాట్లు ఉండటంతో అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించగా, కాశీరామ్‌ది హత్యగా నిర్ధారణ అయింది. దీంతో పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, స్థానికుల సమాచారం ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టగా విస్తుపోయే



విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాము, సంతో ష్‌లతో పాటు కాశీరామ్ భార్య సవితకు ఈ హత్యతో సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వివా హేతర సంబంధాల నేపథ్యంలో కాశీరామ్‌ను అడ్డు తొలగించుకోవాలని నిందితులు పథకం వేసినట్లు దర్యాప్తులో తేలింది.

పోలీసుల వివరాల ప్రకారం.. గత నెల 23న నిందితులు కాశీరామ్‌కు మద్యం తాగించారు. అనంతరం నైలాన్ తాడుతో అతడి గొంతు బిగించి హత్య చేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని చెరువులో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయ త్నించారు. అయితే పోస్టుమార్టం నివేదిక, ఇతర ఆధారాలతో పోలీసుల దర్యాప్తులో హత్య విషయం బయటపడింది. ఈ కేసులో రాము, సంతోష్, కాశీరామ్ భార్య సవిత పాత్ర ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. వివాహేతర సంబంధాల కారణంగా ఒకరి ప్రాణం పోవడంతో పాటు, మరో ముగ్గురు నిందితులు జైలుపాలయ్యా రని పేర్కొన్నారు.

